

భోలక్‌పూర్ పద్మశాలీ కాలనీలో జీహెచ్ఎంసీ శానిటైజేషన్ సూపర్‌వైజర్ గోవర్ధన్‌ను ప్రశ్నిస్తున్న కాలనీవాసులు

రోడ్లపై చెత్త కుప్పలు ఎత్తరా...?

అధికారులను నిలదీసిన పద్మశాలీ కాలనీవాసులు

ముషీరాబాద్, మే 8 (ఆంధ్రజ్యోతి): రోడ్లపై ఎక్కడ చూసినా చెత్తకుప్పలు, చెత్తాచెదారం. ఇదేనా స్వచ్ఛ సర్వేక్షణ్.. నామ్‌కేవాస్తే ప్రచారం చేస్తే ఎలా అని జీహెచ్ఎంసీ శానిటైజేషన్ అధికారులను భోలక్‌పూర్ డివిజన్ పద్మశాలీ కాలనీ వాసులు నిలదీశారు. గురువారం పద్మశాలీ కాలనీలో స్వచ్ఛసర్వేక్షణ్‌పై కాలనీవాసులకు అవగాహన కల్పించేందుకు నిర్వహించిన కార్యక్రమానికి జీహెచ్ఎంసీ శానిటైజేషన్ సూపర్‌వైజర్ గోవర్ధన్, ఎస్ఎఫ్ఏలు హాజరయ్యారు. ఈ సందర్భంగా కాలనీవాసులతో వారు మాట్లాడుతూ... పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, రోడ్లపై చెత్త వేయవద్దని సూచించారు. అధికారుల మాటలు విన్న కాలనీవాసులు, పద్మశాలీ కాలనీ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు సుందర్‌పటాలే, ఆర్.ఆంజనేయులు మాట్లాడుతూ... స్వచ్ఛ సర్వేక్షణ్ అంటే ఏమిటి అని నిలదీశారు. రోడ్లపై ఎక్కడ చూసినా చెత్తాచెదారం, చెత్తకుప్పలు కనిపిస్తున్నాయన్నారు. వాటిని ఎప్పటికప్పుడు తొలగించరా అని ప్రశ్నించారు. గాంధీనగర్, పద్మశాలీకాలనీ, భోలక్‌పూర్, పార్శిగుట్ట తదితర ప్రాంతాల్లో రోడ్లపైనే ఎక్కడ చూసినా చెత్తా చెదారం కనిపిస్తున్నాయని ప్రశ్నించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ అంటే నామ్‌కేవాస్తే చేయడం కాదు, రోడ్లు, కాలనీలను శుభ్రపర్చండని డిమాండ్ చేశారు. కాలనీ వాసులు అడిగే ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పలేక మళ్లీ వస్తామంటూ వెళ్లిపోయారు.



బస్తీ దవాఖానాలో మాట్లాడుతున్న కార్పొరేటర్ కన్నె ఉమాదేవి

బస్తీ దవాఖానాలో బాత్రూములు ఏర్పాటు చేయాలి

- కాచిగూడ కార్పొరేటర్ ఉమాదేవి

బర్కత్‌పుర, మే 8 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ డివిజన్ పరిధిలోని మౌలానా ఆజాద్ నగర్‌లో ఉన్న బస్తీ దవాఖానాలో బాత్‌రూములను ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ కన్నె ఉమాదేవి జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు. బాత్రూములు లేక పోవడం వల్ల దవాఖానాలో పనిచేసే సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆమె తెలిపారు. గురువారం బస్తీ దవాఖానాను సందర్శించి పేదలకు అందుతున్న వైద్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిబ్బంది బాత్రూంల సమస్యను కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, నాయకులు భీమ్‌రాజ్, చందు, వినోద్, నరేష్, రవియాదవ్, దీపక్, సంతోష్ పాల్గొన్నారు.

నర్తకి విజయలక్ష్మి బృందం మలేషియా పర్యటన

చిక్కడపల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి): మలేషియా తెలుగు అసోసియేషన్ వారు మలేషియాలోని రవాంగ్ నగరంలో నిర్వహించే ఉగాది ఉత్సవాల్లో పాల్గొనేందుకు నగరానికి చెందిన నృత్యకళాకారిణి కోకా విజయలక్ష్మికి ఆహ్వానం అందింది. కోకా విజయలక్ష్మి గురువారం విలేకరులతో ఈ విషయం మాట్లాడుతూ తమ పర్యటన వివరాలను తెలియజేశారు. తన బృందంలోని సభ్యులు రవి కూచిపూడి మధుమతి, కులకర్ణి, డి.కీర్తన, కె.నిఖిల, పి.సాయి నీహారిక, కె.విశిష్టలతో కూడిన ఏడుగురితో కలిసి మలేషియాలో ఈనెల 10నుంచి నాలుగురోజుల పాటు పర్యటించి, నృత్యప్రదర్శనలను ఇవ్వనున్నామని తెలిపారు.



మలేషియాలో పర్యటించనున్న బృందం సభ్యులు

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

- చిక్కడపల్లి మెట్రోస్టేషన్ మెట్లపై వాంతులు
- చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి

చిక్కడపల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి మెట్రో స్టేషన్ మెట్లపై పురుగుల మందు తాగిన ఓ గుర్తు తెలియని యువకుడు ఆత్మహత్యకు యత్నించాడు. అతన్ని ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలిస్తుండగా మార్గ మధ్యంలోనే మృతి చెందాడు. ఇన్‌స్పెక్టర్ బి.రాజునాయక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం మధ్యాహ్నం సమయంలో ఓ యువకుడు చిక్కడపల్లి మెట్రోస్టేషన్‌లోకి ప్రవేశించి అరుస్తూ కొంతసేపు అల్లరి చేశాడు. అనంతరం మెట్లపై వాంతులు చేసుకున్నాడు. గమనించిన మెట్రోస్టేషన్ సిబ్బంది అతని వద్దకు వచ్చి చూడగా అతని చేతిలో పురుగుల మందు బాటిల్ ఉంది. వాంతులు విపరీతంగా అవుతుండడంతో మెట్రోస్టేషన్ సిబ్బంది వెంటనే చిక్కడపల్లి పోలీసులకు, 108 సిబ్బందికి సమాచారం అందించారు. 108 వాహనంలో యువకుడిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే అతను మరణించినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. మృతుడిని ఎవరైనా గుర్తిస్తే పీఎస్‌లో సమాచారం అందించాలని సూచించారు. ఎస్ఐ అభిలాష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



గుర్తుతెలియని యువకుడు

చోరీలకు పాల్పడుతున్న నలుగురి అరెస్ట్

అంబర్‌పేట, మే 8 (ఆంధ్రజ్యోతి): నకిలీ నగలతో వ్యాపారుల దృష్టిమరల్చి చోరీలకు పాల్పడుతున్న నలుగురిని అంబర్‌పేట పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. డీఐ హఫీసుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. మొగల్‌పురా సుల్తాన్‌షాహిద్‌కు చెందిన సయ్యద్ అరీఫుద్దీన్(40), షేక్ అహ్మదుద్దీన్(48), నసీమా బేగం(40), ఖయ్యుం సుల్తానా(72)నలుగురు సమీప బంధువులు. ఈనెల 5న వీరందరూ అంబర్‌పేట తిరుమల నగర్‌లోని భవాని జువెలరీ షాప్‌కు వచ్చారు. తమ వద్ద ఉన్న బంగారు గాజులను అమ్ముతామని షాపు యజమానికి చెప్పారు. దీంతో ఆయన గాజులను పరీక్షించడానికి షాపు లోపలికి వెళ్లాడు. అదే సమయంలో వీరు కౌంటర్‌లో ఉన్న రూ.2లక్షల నగదును చోరీ చేసి తీసుకువెళ్లారు. షాపు యజమాని బయటకు వచ్చి చూడగా వీరు, కౌంటర్‌లో డబ్బులు కనిపంచలేదు. దీంతో ఆయన అంబర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరాలు పరిశీలించిన పోలీసులు వీరు చోరీ చేసినట్లు గ్రహించారు. వీరిపై నిఘా పెట్టి, బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు పాతనేరస్థుల రిమాండ్

చిక్కడపల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి): రోడ్లపై నిద్రించేవారిని, దారిన పోయేవారిని బెదిరించి డబ్బులు దోచుకుంటున్న ఇద్దరు పాత నేరస్థులను చిక్కడపల్లి పోలీసులు అదుపులోకి తీసుకుని బుధవారం రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ రాజునాయక్ తెలిపిన వివరాల ప్రకారం...సోమవారం రాత్రి చిక్కడపల్లి బస్టాప్ వద్ద ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న వినోద్‌ను ఇద్దరు బ్లేడు చూపించి బెదిరించి అతని నుంచి రూ.3,500 దోచుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులు పాతనేరస్థులు గణేశ్, మల్లేష్‌గా గుర్తించి, వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.1,120 స్వాధీనం చేసుకుని బుధవారం రిమాండ్‌కు తరలించారు.

ఇళ్లలోకి రాకుంటే 2బీహెచ్‌కే క్యాన్సిల్!

- నోటీసులు ఇస్తున్న అధికారులు
- నీరు, విద్యుత్ సౌకర్యాలు లేవు
- ఆందోళన చెందుతున్న లబ్ధిదారులు



మురారిపల్లేలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లు

ముషీరాబాద్, మే 8 (ఆంధ్రజ్యోతి): డబుల్ బెడ్‌రూం వచ్చిందన్న సంతోషం లబ్ధిదారులకు మూన్నాళ్ల ముచ్చటగా మారింది. డబుల్ బెడ్‌రూం ఇళ్లలోకి వెళ్లితే ఇబ్బందులు... వెళ్లకుంటే ఇళ్లు క్యాన్సిల్ చేస్తామనే అధికారుల హెచ్చరికలతో 2బీహెచ్‌కే లబ్ధిదారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ముషీరాబాద్ నియోజకవర్గంకు చెందిన 2బీహెచ్‌కే లబ్ధిదారులకు శామీర్‌పేట మండలం, మురారిపల్లే గ్రామంలో, తూముకుంట గ్రామంలో, జవహర్ నగర్ మండలం హైదర్‌గూడలో డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయించారు. మురారిపల్లేలో 9ఫ్లోర్లు నిర్మించి ముషీరాబాద్ నియోజకవర్గానికి చెందిన 470 మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేశారు. వీరందరికీ 2023 సంవత్సరం 10వ నెల 21వ తేదీన అధికారులు ఇళ్ల పట్టాలు అందజేశారు. కానీ ఈ భవనాలకు అన్నింటికీ విద్యుత్, మంచినీటి సౌకర్యం కల్పించలేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టాలు పొందిన లబ్ధిదారులు అక్కడ ఉండలేక ఇక్కడ అద్దె ఇళ్లలో రెంటు చెల్లించలేక ఇబ్బంది పడుతున్నారు.

అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు



మంచినీటి సౌకర్యం, విద్యుత్ సౌకర్యం కల్పించాలని సంబంధిత శాఖ అధికారులకు పలుమార్లు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. కానీ వారం రోజుల్లో డబుల్ బెడ్‌రూం ఇళ్లలో ఉండాలని ఆదేశిస్తున్నారు. లేని పక్షంలో మీ ఇళ్లు క్యాన్సల్ చేస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి డబుల్ బెడ్‌రూం ఇళ్లకు కనీస సౌకర్యాలు కల్పించాలి.

- వీరేందర్, 2బీహెచ్‌కే లబ్ధిదారుడు, ముషీరాబాద్

వారం రోజుల్లో వెళ్లకుంటే క్యాన్సిల్

ముషీరాబాద్ తహసీల్దార్ అధికారులు, జీహెచ్ఎంసీ హౌసింగ్ బోర్డు, ముషీరాబాద్ రెవెన్యూ అధికారులు లబ్ధిదారులకు ఫోన్‌లు చేసి 'మీరు వెంటనే డబుల్ బెడ్‌రూం ఇళ్లలోకి వెళ్లాలి' అని ఆదేశిస్తున్నారు. తమ కార్యాలయాలకు వచ్చి నోటీసులు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. వారం రోజుల్లో 'మీరు ఇళ్లలోకి వెళ్లకుంటే మీ ఇళ్లు క్యాన్సిల్ చేస్తాం' అని హెచ్చరిస్తున్నారని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 9 ఫ్లోర్‌లు నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లకు విద్యుత్ సౌకర్యం కల్పించలేదు. లిఫ్ట్ పనిచేయడం లేదు. 9వ ఫ్లోర్‌కు ఎలా వెళ్తాం? వృద్ధులు, పిల్లల పరిస్థితి ఏమిటని లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీస సౌకర్యాలు కల్పిస్తే డబుల్ బెడ్‌రూం ఇళ్లలోకి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని లబ్ధిదారులు పేర్కొంటున్నారు.



మిషన్ భగీరథ డీఈకి వినతిపత్రం అందజేస్తున్న మురారిపల్లే డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్దిదారులు (ఫైల్)

42శాతం బీసీ రిజర్వేషన్ల అమలుకు పొన్నం కృషి

రాంనగర్, మే 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీ కులగణన జరిగి, బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అమలుకు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖమంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ఎంతో కృషి చేశారని అన్నారు. ఈ మేరకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగోని బాల్‌రాజ్‌గౌడ్, వర్కింగ్‌ప్రెసిడెంట్ ఎలికట్టె విజయ్‌కుమార్‌గౌడ్ మాట్లాడారు. బీసీ, గౌడ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని బీసీల సంక్షేమం అభివృద్ధికి ప్రభుత్వ పరంగా రావాల్సిన నిధులు, ఉద్యోగాలు, సంక్షేమ ఫలాలు అందించడానికి మంత్రి పొన్నం చేస్తున్న కృషి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కులగణన విజయవంతం చేయడంలో మంత్రి పొన్నం చొరవ చూపారన్నారు. కార్యక్రమంలో బీసీ కుల సంఘాల జేఏసీ నాయకులు గణేష్ చారి దుర్గయ్యగౌడ్, నాగేష్‌గౌడ్, విక్రమ్‌గౌడ్, శేఖర్ సగర, కుల్కచర్ల శ్రీనివాస్‌గౌడ్, వేముల వెంకటేష్, మణిమంజరి పాల్గొన్నారు.



రాష్ట్ర రోడ్డు రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సన్మానిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నేతలు

అభివృద్ధి పనులు పూర్తి చేయండి : ఎమ్మెల్యే కాలేరు

గోల్నాక, మే 8 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గంలోని ఐదు డివిజన్లలో జలమండలి ఆధ్వర్యంలో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తిచేయాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అధికారులను ఆదేశించారు. గురువారం గోల్నాక తులసీనగర్‌కాలనీ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అంబర్‌పేట నియోజకవర్గంలోని ఐదు డివిజన్లలో జలమండలి ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఇంకా ఆయా ప్రాంతాలలో చేపట్టాల్సిన పనులకు సంబంధించిన నివేదికను రూపొందించి, తనకు అందజేయాలని, దానిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం నిధులను మంజూరు చేయించడం కోసం కృషి చేస్తానని చెప్పారు. ఈ సమావేశంలో అంబర్‌పేట కార్పొరేటర్ ఇ.విజయకుమార్‌గౌడ్, జలమండలి జీఎం విష్ణువర్ధన్, మేనేజర్లు రోహిత్, భావన, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతున్న కాలేరు వెంకటేష్

26న ప్రజాతిరంగ్ యాత్ర

రాంనగర్, మే 8 (ఆంధ్రజ్యోతి): సామాజిక తెలంగాణ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీన భద్రాచలం నుంచి హైదరాబాద్ వరకు ప్రజాతిరంగ్ యాత్రను నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు అమనగంటి సైదులు తెలిపారు. దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను సుందరయ్య విజ్ఞన కేంద్రం వద్ద ఆయన గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజల పక్షాన, ప్రభుత్వం పక్షాన తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిని కోరుతూ జరిగే యాత్రలో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. యాత్రలో భాగంగా ప్రజాసమస్యలు తెలుసుకుంటూ ఉపాధి, విద్య, ఉద్యోగం, రాజ్యాధికారం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. ఈ యాత్ర భద్రాచలంలో ప్రారంభమై ఖమ్మం, సూర్యపేట, జనగాం, భువనగిరి, ఘట్‌కేసర్ మీదుగా ఉప్పల్ రింగ్‌రోడ్డు వద్ద ముగుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజాఫంట్ రాష్ట్ర కమిటీ సభ్యులు రాంబాబు. సినీ డైరెక్టర్ శ్రీపాదరామచంద్రరావు, మైనార్టీ నాయకులు ముస్తాఫా తదితరులు పాల్గొన్నారు.



ప్రజాతిరంగ్‌యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సైదులు తదితరులు

12న 'అరుణోదయ' 50 వసంతాల వేడుక

రాంనగర్, మే 8 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 12న జరగనున్న అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య 50 వసంతాల వేడుకలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద సమాఖ్య గౌరవ అధ్యక్షురాలు విమలక్క ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు నాగిరెడ్డి, పోతుల రమేష్, లింగన్న, అనిత, గంగ, నూతన్, చిన్నన్న తదితరులు పాల్గొన్నారు.

రైల్‌లో ఇద్దరు ప్రయాణికుల ఆభరణాల చోరీ

బర్కత్‌పురా, మే 8 (ఆంధ్రజ్యోతి): బికనూర్ - కాచిగూడ ఎక్స్‌ప్రెస్ రైల్లో ఇద్దరు ప్రయాణికుల నుంచి బంగారు, వెండి ఆభరణాలు, నగదును దొంగలు తస్కరించారు. కాచిగూడ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ రెజిమెంటల్ బజార్లో నివాసముంటున్న చంద్రకాంత చచన్(45) బిక్కనూర్- కాచిగూడ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైల్‌లో నగరానికి వస్తోంది. ముత్తుకేడు స్టేషన్ సమీపంలో ఆమె బ్యాగును దొంగలు తస్కరించారు. అందులో 115 గ్రాముల వెండి ఆభరణాలు, ఒక గ్రాము బంగారు గాజులు, సెల్ ఫోను, ఆధార్ కార్డులు, బ్యాంక్ ఆఫ్ బరోడా లాకర్ కీ ఉన్నాయి. మరో సంఘటనలో మహారాష్ట్ర అకోలాకు చెందిన సూచితఆనంద్(45) బికనూర్-కాచిగూడ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైల్లో నగరానికి వస్తుండగా కామారెడ్డి సమీపంలో ఆమె పర్సును తస్కరించారు. రూ.20వేల నగదు ఉంది. గురువారం కాచిగూడ రైల్వేపీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భారత్‌కు ప్రపంచ దేశాలు మద్దతు ఇవ్వాలి

ఆప్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్

కవాడిగూడ, మే 8 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదాన్ని నిర్మూలించడానికి భారతదేశానికి ప్రపంచ దేశాలు మద్దతు ఇవ్వాలని, దళాల ధైర్యం ప్రతి భారత పౌరుడి విశ్వాసం అని, ఆపరేషన్ సిందూర్ విజయమని ఆమ్‌ఆద్మీపార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ అన్నారు. గురువారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆప్ ఆధ్వర్యంలో సాయుధ దళాలకు సంఘీభావంగా ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాకిస్తాన్ భూభాగంలో ఉగ్రవాద స్థావరాలను నాశనం చేసిన భారత త్రివిధ దళాల ధైర్యానికి ఆప్ నేతలు వందనాలు తెలిపారు. ఉగ్రవాదం నిర్మూలించాలి, పాకిస్థాన్ నశించాలి, భారత్ మాతాకి జై అంటూ ఆప్ నేతలు నినదించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ పాకిస్తాన్‌లో ఉగ్రవాద కర్మాగారాలను అంతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి ఆప్ సంపూర్ణమద్దతు ప్రకటిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆప్ నేతలు జావిద్, షరీఫ్, లక్ష్మనాయుడు. సుధారాణి, అజీజ్ బేగ్, షాబాజ్, సిద్దార్థ్, రెడ్డి, రమ్యగౌడ్, విశాలి, లియఖత్ ఖాన్, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.



లోయర్ ట్యాంక్‌బండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద సైనికులకు మద్దతుగా సంఘీభావం తెలుపుతున్న ఆప్ రాష్ట్ర కన్వీనర్ దిడ్డి సుధాకర్, నేతలు

● పార్టీ, నామినేటెడ్ పదవులు ఇవ్వాలి



టీడీపీ పటిష్టత కోసం దీర్ఘకాలంగా సేవలందిస్తున్న తమకు తగిన పార్టీ, నామినేటెడ్ పదవులు ఇవ్వాలని పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఏపీ సీఎం చంద్రబాబును కోరారు. ఈ మేరకు చంద్రబాబుకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర మాజీ కార్యదర్శి కట్ట రాములు, నాయకులు పూనా శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. **- రాంనగర్, ఆంధ్రజ్యోతి**

● భారత సైన్యానికి సంఘీభావం



భారత సైన్యం పాకిస్థాన్ టెర్రరిస్టులకు వ్యతిరేకంగా చేస్తున్న యుద్ధానికి మద్దతుగా రాష్ట్ర ప్రభుత్వం గురువారం నిర్వహించిన సంఘీభావ ర్యాలీలో పాల్గొని మద్దతు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కనీస వేతనాల అమలు బోర్డు మాజీ చైర్మన్ జి.నాగభూషణం, కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్, టీపీసీసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఆర్.లక్ష్మణ్‌యాదవ్ తదితర కాంగ్రెస్ నేతలు జాతీయ జెండా ప్రదర్శించి సంఘీభావం తెలిపారు. **- రాంనగర్, మే 8 (ఆంధ్రజ్యోతి)**

● ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌కు సత్కారం



అంబర్‌పేట పోలీసస్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కిరణ్‌కుమార్‌ను సత్కరిస్తున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దూసరి శ్రీనివాస్‌గౌడ్, బోయపల్లి లింగంగౌడ్, పార్టీ గోల్నాక డివిజన్ ప్రధానకార్యదర్శి భూపతి లక్ష్మణ్, పార్టీ నేత శివరామకృష్ణ తదితరులు ఉన్నారు. **- గోల్నాక, మే 8 (ఆంధ్రజ్యోతి)**

ఎస్‌వీఎస్‌లో తాగునీటి కేంద్రం ప్రారంభం

రాంనగర్, మే 8 (ఆంధ్రజ్యోతి): విద్యానగర్‌లోని స్వామి వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఎన్ఎస్ఎస్ యూనిట్లు, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో తాగునీటి కేంద్రాన్ని గురువారం ఏర్పాటు చేశారు. దీనిని ఉస్మానియా యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ విద్యాసాగర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.ప్రభు, అధ్యాపకులు నీరజ, రాజశేఖర్, అనురాధ, జగన్, సుభాష్‌రెడ్డి, మనోజ్ కుమార్, తిరుపతి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నడిరోడ్డుపై నిలిచిన కారు

చిక్కడపల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి వివేక్‌నగర్ శ్రీఆంజనేయ స్వామి ఆలయం ఎదుట నిత్యం రద్దీగా ఉండే నడిరోడ్డుపై బుధవారం ఉదయం 9 గంటల సమయంలో ఓ కారు నిలిచిపోయింది. ఇంజన్ జామ్ కావడంతో కారును కనీసం తోద్దామన్నా వీలులేకపోయింది. దీంతో కారు యజమాని అక్కడే నడిరోడ్డుపై వదిలేసి వెళ్లిపోయాడు. కారుడిక్కీ, బాయ్‌నెట్, డోర్‌లకు చెట్టుకొమ్మలు ఉంచి అక్కడి నుంచి మెకానిక్ కోసం వెళ్లాడు. మధ్యాహ్నం మెకానిక్ వచ్చి కారు ఇంజన్‌ను చెక్‌చేసి, తీసుకెళ్లాడు. దీంతో రాకపోకలకు ఇబ్బందులు తొలిగిపోయాయి.



నడిరోడ్డుపై నిలిచిపోయిన కారు

సంజయ్ సంఘ్వీ పోరాటాలు స్ఫూర్తిదాయకం

రాంనగర్, మే 8 (ఆంధ్రజ్యోతి): సీపీఐఎంఎల్ మాస్‌లైన్ కేంద్ర కమిటీ సభ్యులు సంజయ్ సంఘ్వీ జీవితం అందరికీ ఆదర్శనీయమని ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు ప్రవీణ్ నఢ్కర్ పేర్కొన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సంజయ్ సంఘ్వీ నిస్వార్థంగా పోరాటం చేశారన్నారు. గురువారం విద్యానగర్‌లోని మార్క్సు భవన్‌లో ఆ పార్టీ నాయకులు రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు ఎం.హన్మేష్ అధ్యక్షతన సంజయ్ సంఘ్వీ సంతాప సభ జరిగింది కార్యక్రమంలో ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు కేజీ.రాంచందర్, పార్టీ నాయకులు చర్పల రంగయ్య, కృష్ణ, ప్రభాకర్, కె.సూర్యం, ఎం.కృష్ణ, ఎస్ఎల్.పద్మ, సదానందం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

రాంనగర్, మే 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యలను పరిష్కరించడంలో సీఎం నిర్లక్ష్యం తగదని పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధానకార్యదర్శులు ఎ.రాజేంద్రబాబు, ఎంవీ.నర్సింగ్‌రావు, కోశాధికారి వి.నర్సయ్య పేర్కొన్నారు. గురువారం సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారుమాట్లాడుతూ, ఇటీవల సీఎం మాట్లాడుతూ, 'మీరు ప్రజలతో యుద్ధం చేస్తారా అని ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లను బెదిరించడం ఎంతవరకు సబబని వారు ప్రశ్నించారు. తమ డిమాండ్ల పరిష్కారం కోసం ప్రజాస్వామ్యబద్ధంగా నిరసనలు చేయడం ధర్నాలు చేయడం ప్రశ్నించడం తమ హక్కని వారు పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తాను చేసిన వాఖ్యలను వెనక్కి తీసుకోవాలని కోరారు.

అనూషకు ధాత్రిరత్న ప్రదానం

సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణలో పేరొందిన అక్షయ జ్యోతి ఉమెన్ అండ్ చైల్డ్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు జి.అనూషకు రెడ్ క్రాస్ సొసైటీ తరఫున ఆ సంస్థ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు మామిడి భీమ్‌రెడ్డి ఆమెకు ధాత్రిరత్న అవార్డు ప్రదానం చేశారు.

- రాంనగర్, మే 8 (ఆంధ్రజ్యోతి)



గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం స్వాధీనం

కవాడిగూడ, మే 8 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ పీఎస్ పరిధిలో గుర్తుతెలియని 60 సంవత్సరాల వృద్ధుడి మృతదేహాన్ని గురువారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గాంధీ ఆస్పత్రి ఎదురుగా ఉన్న 1029 పిల్లర్ వద్ద ఓ వృద్ధుడు పడిఉన్నాడని సమాచారం మేరకు గాంధీనగర్ పోలీసులు అక్కడికి వెళ్లారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించామని ఎస్ఐ నర్సింహ తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసినవారు గాంధీనగర్ పోలీస్‌స్టేషన్‌లో గానీ లేదా ఫోన్ నెంబర్ 87126 60145లో గానీ తెలుపాలని ఎస్ఐ కోరారు.